క్లుప్తంగా

నేటి నుంచి సామాజిక తనిఖీలు

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారంఎస్ఆర్ఈజీఎస్ సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ పీఎస్ నరేష్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఉపాధి హామీ పనుల నిర్వహణకు ప్రాధాన్యమివ్వాలన్నారు. దానిలో భాగంగా మంగళవారం నుంచి సామాజిక తనిఖీలు జరుగుతున్నాయన్నారు. మంగళవారం నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకూ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఎస్ఆర్ఈజీఎస్ స్టేట్ రిసోర్స్‌పర్సన్ తులసీ నాయక్, ఏపీఓ భ్రమరాంబిక, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మణికుమార్‌కు అంబేడ్కర్ అవార్డు



అంబేడ్కర్ అవార్డు అందుకుంటున్న మణికుమార్

రాజానగరం: రక్తదానం ద్వారా ఎందరికో ప్రాణదానం చేస్తూ, సమాజంలో సేవాభావంతో పయనిస్తున్న కొండగుంటూరుకు చెందిన పెంటగట్ల మణికుమార్‌కు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు లభించింది. విజయవాడలోని అక్కినేని నాగేశ్వరరావు ఫంక్షన్ హాలులో మదర్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మల్లాది ప్రసాదరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన అవార్డును అందుకున్నారు. మణికుమార్ ఇంతవరకు 36 సార్లు రక్తదానం చేశారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

పెదపూడి: నియోజకవర్గంలోని ప్రసిద్ధి చెందిన ఆలయాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏడు ఆలయాలను సుమారు రూ.7 కోట్లతో అభివృద్ధి చేయనున్నామన్నారు. ఆయా ఆలయాల అభివృద్ధికి అయ్యే ఖర్చులో మూడో వంతు విరాళంగా ప్రజలు ఇచ్చి సహకరించాలన్నారు. కార్యక్రమంలో జుత్తుక సూర్యకుమారి, నులుకుర్తి వెంకటేశ్వరరావు, రావడ నాగు, పుట్టా గంగాధర్ చౌదరి, తమలంపూడి శివరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జక్కంపూడి రాజాకు అభినందనలు



జక్కంపూడి రాజాను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజానగరం: వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు పలువురు పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు. వారిలో పార్టీ సీనియర్ నాయకుడు గంగిశెట్టి సోమేశ్వరరావు, వేమగిరి కృష్ణ, నాళం రోశయ్య, పిల్లి లక్ష్మీనారాయణ, బోయిడి గణపతి, నురుకుర్తి సూరిబాబు, కొప్పిశెట్టి శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

నిండు శోకంతో సంతాప దినాలు



ద్రాక్షారామలో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో అర్బయీన్ 40 రోజుల సంతాప దినాలు నిండు శోకంతో ముగిశాయి. అంజుమన్ సంఘాలు, పంజా ధర్మకర్తల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముస్లింలు కర్బలా పుణ్యభూమిలో వందల ఏళ్ల క్రితం మహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్, ఆయన పరివారం, వీర మరణం పొందడం గుర్తు చేసుకుంటూ బోరున విలపించారు. ఆదివారం రాత్రి 40వ రోజు మృత కళేబరాల ఖననం స్మరించుకుంటూ విషాద గేయాలు ఆలపించారు. సోమవారం ముంబై నుంచి విచ్చేసిన మత గురువు మౌలానా అఖిల్ తురాబి, మత గురువు మౌలానా మీర్జా అస్కరి హుస్సేన్‌లు మజ్లిస్‌ల రూపంలో ప్రవక్తలు అనుభవించిన కష్టాలను వివరిస్తున్నప్పుడు భక్తులు ముక్త కంఠంతో విలపించారు. గుర్రాలపై హమాలీలు ఊరేగుతూ మాతం నిర్వహించారు.

రోగికి రూ.20 వేల సాయం

మామిడికుదురు: మగటపల్లి గ్రామానికి చెందిన గోవిందవర్జుల శ్రీనివాసరావు భార్య హృద్రోగ సమస్యతో బాధపడుతున్నారు. ఆమె వైద్య సేవల కోసం నామన ఫౌండేషన్ ద్వారా సోమవారం రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. జెడ్పీ మాజీ చైర్మన్, ఫౌండేషన్ చైర్మన్ నామన రాంబాబు, డాక్టర్ నామన వినోద్ ఈ సహాయాన్ని శ్రీనివాసరావుకు అందజేశారు. ఉండ్రు శ్రీరామారావు, కుంపట్ల బాబ్జి, రమేష్, మహేంద్ర పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలి. ఆస్పత్రుల్లో పటిష్ట భద్రత కల్పిస్తేనే నిర్భయంగా విధులు నిర్వహించగలం. పీహెచ్‌సీల్లో సీసీ కెమెరాల ద్వారా నిఘా పెట్టాలి. నైట్ డ్యూటీ చేసే మహిళా వైద్యులకు రక్షణ కల్పించాలి. కోల్‌కతా ఘటన మహిళా డాక్టర్లను తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. కఠిన చట్టాలు తీసుకొస్తేనే ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయి.

– శ్యామల, వైద్యురాలు, సంపర పీహెచ్‌సీ

ప్రత్యేక చట్టం తీసుకురావాలి



వైద్యవృత్తిలో ఉండే మహిళా వైద్యులు నిర్భయంగా విధులు నిర్వర్తించేందుకు వీలుగా ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. కోల్‌కతా హత్యాచార ఘటన తలుచుకుంటేనే భయమేస్తోంది. ప్రభుత్వాలు మహిళా డాక్టర్లు ధైర్యంగా విధులు నిర్వర్తించే పరిస్థితిని కల్పించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల వద్ద పటిష్టమైన రక్షణ ఏర్పాట్లు చేయాలి.

– డాక్టర్ జి.ఏసుజ్యోతి, పీహెచ్‌సీ వైద్యురాలు, కొంకుదురు

గ్రామాల్లో వైద్య శిబిరాలకు మంగళం!

- జగనన్న ఆరోగ్య సురక్ష ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- గ్రామాల్లో వైద్య సేవల కోసం ఎదురుచూస్తున్న ప్రజలు



రంగంపేట జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు (ఫైల్)

రంగంపేట: ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన గత ప్రభుత్వం గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను నిర్వహించింది. ఈ శిబిరాల్లో స్పెషలిస్టు వైద్యుల ద్వారా సేవలను అందించడమే కాకుండా మందులను సైతం ఉచితంగా అందించింది. ఏదైనా ఆపరేషన్ అవసరమైతే ఆరోగ్యశ్రీ ద్వారా చేయించుకునేందుకు వీలుగా సిఫార్సు చేసేవారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలోనూ మెగా హెల్త్ క్యాంపులు నిర్వహించారు. చిన్న పిల్లలు, గర్భిణులు, చెవి, ముక్కు, గొంతు, కళ్లు, కిడ్నీ, గుండె, ఎముకల విభాగాల్లో నిపుణులను గ్రామాలకు తీసుకొచ్చి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేవారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ప్రతి వైద్య శిబిరానికి సుమారు 10 మంది స్పెషలిస్టు డాక్టర్లతో పాటు ప్రభుత్వ వైద్యులు అందుబాటులో ఉండి ఉదయం నుంచి సాయంత్రం వరకూ రోగులను పరీక్షించేవారు. ఆయా శిబిరాల్లో 14 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు మందులను సైతం ఉచితంగా అందించేవారు.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

సార్వత్రిక ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రజల వైద్యాన్ని గాలికి వదిలేసింది. గ్రామాల్లో మెగా వైద్య శిబిరాల నిర్వహణ మచ్చుకైనా కనిపించడం లేదు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి భరోసా ఇస్తే నేటి ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రజలకు మేలు చేసే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడేసినట్లేనన్న చర్చ సర్వత్రా సాగుతోంది. గ్రామాల్లో వైద్య సేవల కోసం ఎదురుచూస్తున్న ప్రజలు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య శిబిరాలను కొనసాగించాలని కోరుతున్నారు.

ధైర్యంగా ఉండేవాళ్లం



గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో గ్రామీణ ప్రజలంతా చాలా ధైర్యంగా ఉండేవాళ్లం. మాకేమైనా జరిగితే మా జగన్‌బాబు ఉన్నాడు అంటూ వృద్ధులు సంతోషంగా ఉండేవారు. కానీ ఇప్పుడు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించకపోవడం వల్ల ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

– మట్టా శ్రీను, వైస్ ఎంపీపీ, నల్లమిల్లి, రంగంపేట మండలం

పైసా ఖర్చు ఉండేది కాదు



జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఒక్కపైసా ఖర్చు లేకుండా అవసరమైన మేర ఉచితంగా పరీక్షలు నిర్వహించేవారు. గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడేవారు సైతం శిబిరాలకు వెళ్లి పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు తెచ్చుకునేవారు. ఇప్పుడు శిబిరాల నిర్వహణపై స్పష్టత కరవవ్వడంతో రోగులకు ఏం చేయాలో పాలుపోవడం లేదు.

– పేపకాయల రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు, సుభద్రంపేట, రంగంపేట మండలం

జక్కంపూడి రాజాను కలిసిన కృష్ణారెడ్డి



జక్కంపూడి రాజాను కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న సబ్బెళ్ల కృష్ణారెడ్డి తదితరులు

పెదపూడి: వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన రాజానగరం మాజీ ఎమ్మెల్యే, తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజాను అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజమహేంద్రవరంలోని రాజా స్వగృహంలో సబ్బెళ్ల కృష్ణారెడ్డితో పాటు వైఎస్సార్ సీపీ పెదపూడి మండల కన్వీనర్ గుత్తుల వెంకటరమణ, జిల్లా ఎస్సీ సెల్ ప్రతినిధి, జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, అనపర్తి ఎంపీటీసీ కొండేటి భీమేష్ తదితరులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

మదర్ థెరిసా సేవలు స్ఫూర్తిదాయకం



జి.మామిడాడలో మదర్ థెరిసా విగ్రహానికి నివాళులర్పిస్తున్న క్లబ్ ప్రతినిధులు



సీతానగరంలో విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: నిరుపేదలకు, అనాథలకు మదర్ థెరిసా అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి రమేష్ బాబు (డాక్టర్ బాబు) అన్నారు. ఆమె జయంతి సందర్భంగా సోమవారం సీతానగరం మదర్ థెరిస్సా సెంటర్‌లో వేడుకలు నిర్వహించారు. మదర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వృద్ధులకు, చిన్నారులకు పంపిణీ చేశారు. అనంతరం భవిత కేంద్రంలోని ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ మాజీ ఆర్బీకే చైర్మన్ వలవల వెంకట్రాజు, మాజీ ఎంపీపీ పెందుర్తి దేవదాసు, సర్పంచ్ కోండ్రపు ముత్యాలు, చిర్రవూరి మధుసూదనరావు, వలవల సత్తిబాబు, కసి సత్తిబాబు, వలవల వల్లీ, వలవల కొండలరాయుడు పాల్గొన్నారు.

పెదపూడి మండలంలో..

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో లయన్స్‌క్లబ్ శ్రీసూర్య ఆధ్వర్యంలో భారతరత్న మదర్ థెరిసా జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని మదర్ థెరిసా విగ్రహానికి క్లబ్ అధ్యక్షుడు కడిమి శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మదర్ థెరిసాను ఆదర్శంగా తీసుకుని సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. క్లబ్ మెంటర్ మండ రాజారెడ్డి మాట్లాడుతూ మదర్ థెరిసా జయంతిని పురస్కరించుకుని సుమారు 60 మంది వృద్ధులకు భోజన ప్యాకెట్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి యువరాజారెడ్డి, కోశాధికారి డీఆర్‌కేరెడ్డి, క్లబ్ ప్రతినిధులు భాస్కరరెడ్డి, రావాడ నాగు, లక్ష్మణరావు, నామాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలి



కొత్తపేట వీహెచ్‌పీ సమావేశంలో మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

కొత్తపేట: హిందువులు అందరూ ఐకమత్యంగా నిలిచి హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అధ్యక్షుడు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ స్థాపన జరిగి ఈ కృష్ణాష్టమికి 60 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా వీహెచ్‌పీ షష్ట్యాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వీహెచ్‌పీ జిల్లా మందిర అర్చక ప్రముఖ్ కోటిపల్లి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన సభకు అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించగా రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అక్కిరెడ్డి మాట్లాడుతూ హిందువులు తమ కులాన్ని ఇంటికే పరిమితం చేసుకుని బయట మాత్రం హిందువులం, బంధువులుగా మెలగాలన్నారు. ఐకమత్యంగా హిందూ ధర్మాన్ని ఆచరించాలని పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి గోవిందు, కోశాధికారి నూలు శ్యామల, హిందూ సంపర్క ప్రముఖ్ జెల్లి సర్వలక్ష్మి, రిటైర్డ్ ఎంఈఓ ఏడిద సత్తిరాజు, బీజేపీ జిల్లా కన్వీనర్ ఇళ్ల సత్యనారాయణ, అర్చకుడు ఖండవిల్లి పాండురంగాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు

కంబాలచెరువు: నగరంలోని పలు స్కానింగ్ సెంటర్లలో సోమవారం వైద్య,ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇమేజింగ్, ఫణీంద్ర స్కానింగ్, జాగ్రుతి డయాగ్నోస్టిక్ సెంటర్లను డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎం.శ్రీహరిబాబు, సిబ్బంది పరిశీలించారు. వీటిలో ధరల పట్టిక లేకపోవడం, రికార్డులు సక్రమంగా లేకపోవడంతో నోటీసులు జారీ చేశారు.

అన్నదానం మహోన్నతం



వృద్ధులకు భోజనం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం రూరల్: అన్నదానం మహోన్నతమైనదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. శాటిలైట్‌సిటీలోని మానవీయ ఐక్యసేవ అసోసియేషన్ ఆశ్రమంలో తానేటి శ్రీనివాసరావు పుట్టినరోజు సందర్భంగా సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన జక్కంపూడి రాజా మాట్లాడుతూ వృద్ధాశ్రమం పరిస్థితిని చూస్తే మనసు చలిస్తోందని, జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ ద్వారా దీని అభివృద్ధికి కొంత ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాయుడు కాక, కోడి కోట, తలుపులు, దాసరి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



అనపర్తి బాలరాజేశ్వరి పీఠంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు, షిరిడీ సాయిబాబా



పందలపాకలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా ఏపీత్రయం, జి.మామిడాడ, పెదపూడి, పెద్దాడ, సంపర, కాండ్రేగుల, రామేశ్వరం తదితర గ్రామాల్లో కృష్ణుడి ఆలయాల వద్ద ఉత్సాహంగా వేడుకలు జరిగాయి. యువకులు, చిన్నారులు ఉల్లాసంగా ఉట్టికొట్టే కార్యక్రమాల్లో పాల్గొన్నారు కొంతమంది విద్యార్థులు చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలో అందరినీ అలరించారు.

అనపర్తిలో...

అనపర్తిలో సనాతన ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు బాల రాజేశ్వరి పీఠంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, తులసి దళాలతో అర్చనలు నిర్వహించారు.

రంగంపేట: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం మండల వ్యాప్తంగా సంబరంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆయా గ్రామాల్లోని ఆలయాలకు వెళ్లి అత్యంత భక్తిశ్రద్ధలతో కృష్ణ భగవానుని దర్శించుకున్నారు. చిన్ని కృష్ణులు సందడి చేశారు.

బిక్కవోలు: మండలంలోని కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా చిన్నారులు బాలకృష్ణుడు, రాధాగోపికల వేషధారణలతో అలరించారు. మండలంలోని పందలపాక శ్రీకట్లమ్మ తల్లి ఆలయం వద్ద చిన్నారులు ఉట్టి కొట్టారు. అనంతరం వెలమపేట రామాలయం వద్ద కృష్ణుడిని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు, భజనలు చేశారు.

రాజానగరం: నియోజకవర్గంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం అత్యంత వైభవంగా, సంప్రదాయబద్ధంగా వేడుకగా జరిగాయి. వైష్ణవాలయాలలో పలుచోట్ల ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. రాజానగరంలోని షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉట్టిని ఊరేగింపుగా వచ్చిన యాదవులతో కొట్టించారు. తొలుత స్థానిక అగ్రహారంలో ప్రత్యేక పూజలు చేసి, ఉట్టి కొట్టారు. అనంతరం పల్లకీపై ఊరేగిస్తూ, పలుచోట్ల ఉట్టి కొడుతూ గ్రామోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. దివాన్ చెరువు, శ్రీకృష్ణపట్నం, పుణ్యక్షేత్రం, భూపాలపట్నం, తోకాడ, పల్ల కడియం, సీతారామపురం, నందరాడ, రాధేయపాలెం, తుంగపాడు, తదితర గ్రామాల్లోను సంబరాలు జరిగాయి.

సీతానగరం మండలంలో..

సీతానగరం: స్థానిక విష్ణాలయంలో సత్యభామ, రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టి కొట్టే కార్యక్రమం వైభవంగా జరిగింది. సీతానగరం పంచాయతీ పరిధిలోని లంకూరు, వెలమపేట గోపాల కృష్ణుని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. రఘుదేవపురం రంగారావు ఆసుపత్రి వద్ద గల శ్రీకృష్ణుని ఆలయం, మునికూడలిలోని వేణుగోపాలస్వామి ఆలయం, సింగవరం పంచాయతీ పరిధిలోని కృష్ణుని కాలనీలో, కాటవరం శ్రీకృష్ణుని ఆశ్రమంలో, రాపాక పంచాయతీ పరిధిలోని శ్రీరామనగరం చిట్టిబాబాజీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మధురపూడి: కోరుకొండ మండలంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. పశ్చిమగానుగూడెం కృష్ణాలయం, కోరుకొండ రాధాకృష్ణ ఆలయం, దోసకాయలపల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నర్సాపురం రాధాకృష్ణ ఆలయంలోని కృష్ణుడిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి దర్శించుకున్నారు. బూరుగుపూడి రామాలయం వద్ద ఉట్టుకొట్టే కార్యక్రమం సందడిగా జరిగింది. స్థానిక షిర్డీసాయి స్కూల్లో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ ఆకట్టుకుంది.



రాజానగరంలోని సాయిబాబా ఆలయం వద్ద ఉట్టి కొడుతున్న యాదవులు

శ్రీకృష్ణునికి పూజలు



దివాన్ చెరువులో శ్రీకృష్ణుని దర్శించుకున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజానగరం: దివాన్ చెరువులో జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న శ్రీకృష్ణుని ఆలయంలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పూజలు నిర్వహించారు. అలాగే రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్‌తో పాటు కూటమి నాయకులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద చిన్నారుల కోలాటం విశేషంగా ఆకట్టుకుంది.

గోదావరి తీరంలో మార్మోగిన వేదనాదం



జగద్గురు పీఠంలో నిర్వహించిన వేదసభలో పాల్గొన్న పండితులు

సీటీఆర్ఐ: వేదనాదంతో గోదావరితీరం మార్మోగింది. ఏటా శ్రావణమాసంలో ప్రముఖ పరిషత్తులు, ట్రస్టులు నిర్వహించే వేదసభలకు రంగం సిద్ధమైంది. దీనిలో భాగంగా నగరంలో పలుచోట్ల సోమవారం వేదసభలను ఘనంగా నిర్వహించారు.

వేదశాస్త్ర పరిషత్తు ఆధ్వర్యంలో..

వేదశాస్త్ర పరిషత్తు 88వ వార్షిక వేదసభ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు త్యాగరాజ నారాయణ దాస సేవాసమితి ప్రాంగణంలో నిర్వహించారు. పరిషత్తు ఆధ్వర్యంలో జరిగిన పరీక్షలలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పట్టాల ప్రదానం, పండిత సత్కారం జరిగాయి. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాజెక్టు ఆఫీసర్ ఎవీఎస్ఎస్. విభీషణశర్మ, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ, ఎస్పీ నరసింహ కిషోర్, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

బులుసువారి వేదసభ

కళాగౌతమి ఆధ్వర్యంలో డాక్టర్ బీవీఎస్ మూర్తి నిర్వహించే వేదసభను మధ్యాహ్నం ఒంటి గంటకు గౌతమ ఘాట్‌లోని జగద్గురుపీఠంలో నిర్వహించారు. వేద పండితులను, వేద విద్యార్థులను నిర్వాహకుడు బీవీఎస్ మూర్తి సత్కరించారు.

విశ్వనాథ జగన్నాథ ఘనపాఠి ట్రస్టు ఆధ్వర్యంలో..

భారత తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న విశ్వనాథ జగన్నాథ ఘనపాఠి పేరిట ఆయన తనయుడు, మహామహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ ఏటా నిర్వహించే వేదసభ సాయంత్రం 6 గంటలకు గోదావరి గట్టున ఉన్న శృంగేరీ శారదా శంకర మఠంలో నిర్వహించారు. పలువురు వేదపండితులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం సిటీ: భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం పార్టీ స్థానిక కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ప్రతి మూడేళ్లకు ఒక్కసారి సభ్యత్వ నమోదు జరగడం సర్వసాధారణమన్నారు. బీజేపీ పార్టీ ప్రతి ఆరు సంవత్సరాలకొకసారి సంపూర్ణంగా నమోదు కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో బీజేపీ సభ్యత్వం తీసుకున్నవారు 18 కోట్ల మంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, రేలంగి శ్రీదేవి, బొమ్మల దత్తు తదితరులు పాల్గొన్నారు.

508 కలశాలతో శ్రీకృష్ణునికి మహా అభిషేకం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభూ సుందరశ్రీనివాస్ దాస్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిపారు. అమలాపురం ఎంపీ హరీష్‌మాథుర్ ఈ వేడుకలకు హాజరయ్యారు. సుందర శ్రీనివాస్‌దాస్ శ్రీకృష్ణుడు లీలలను ప్రవచించారు. సాయంత్రం ఉట్టి సంబరం వేడుకలను జరిపారు. ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 12.30 గంటల వరకూ స్వామికి విశేష పూజలు జరిపారు. 508 కలశాలతో మహాభిషేకం, మహా భోగనివేదన, మహాహారతి వంటి విశేష క్రతువులు జరిపారు.